క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో నాయకులు గ్రామస్తులు

దౌల్తాబాద్: మండలంలోని అల్లాపూర్ గ్రామంలో శుక్రవారం ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేద పండితులు రెండు రోజులుగా బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురువారం గ్రామానికి చెందిన ఆడపడుచులు బొడ్రాయికి క్షీరాభిషేకం నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, వెంకట్‌రెడ్డి, వీరన్న, మహిపాల్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం వడ్డించాలి

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న లాల్యానాయక్

దోమ: విద్యార్థులకు పౌష్టికాహారం వడ్డించాలని, మధ్యాహ్న భోజనంలో నిర్వాహకులు నాణ్యతాప్రమాణాలు పాటించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ పేర్కొన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని కిష్టాపూర్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిసరాలు, రికార్డులను పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బోధనోపకరణాలను ఉపయోగించి పాఠాలు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ పోరాటం స్ఫూర్తిదాయకం



మందకృష్ణను కలిసిన కుల్కచర్ల ఎమ్మార్పీఎస్ నాయకులు

కుల్కచర్ల: ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నిర్వహించిన పోరాటం స్ఫూర్తిదాయకమని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుల్కచర్ల ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం కుల్కచర్ల ఎమ్మార్పీఎస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు నగరంలోని మందకృష్ణ నివాసానికి వెళ్లి ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, కాంగ్రెస్ బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, కుల్కచర్ల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుప్పలి వెంకటేశ్, సంఘం నాయకులు పెద్ద నర్సింలు, లక్ష్మయ్య, గడ్డం వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

మండల అధ్యక్షుడు సురేందర్



బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ అందజేస్తున్న నాయకులు

పూడూరు: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్ పేర్కొన్నారు. మీర్జాపూర్ గ్రామానికి చెందిన షాహిస్థాఖానం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యుల సలహా మేరకు ఆపరేషన్ నిమిత్తం కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో సీఎంఆర్ఎఫ్‌ను మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన రూ. 2.5లక్షల ఎల్ఓసిని బాధితురాలి కుటుంబికులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మక్బూల్, అఫ్జల్, అశోక్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: బాలంపేట గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత!

- పూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ముగ్గురితోనే కార్యకలాపాలు
- పనుల కోసం పడిగాపులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పూడూరు తహసీల్దార్ కార్యాలయం

పూడూరు: పూడూరు తహసీల్దార్ కార్యాలయంలో పూర్తి స్థాయి సిబ్బంది లేక ఆయా పనుల కోసం వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెలలో రైతులకు సంబంధించిన భూములను రియల్ వ్యాపారులకు రిజిస్ట్రేషన్ చేయడంతో డిప్యూటీ తహసీల్దార్‌ను సస్పెండ్ చేశారు. ఇందులో ప్రమేయం ఉన్న ధరణి ఆపరేటర్, రెగ్యూలర్ కంప్యూటర్ ఆపరేటర్లను విధుల నుంచి తప్పించారు. మరో మహిళా ఆర్ఐ ఉన్నతాధికారుల పేరు చెప్పి రైతు వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో సదరు రైతు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. ఈ విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు సదరు మహిళ ఆర్ఐను కలెక్టర్ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ అధికారిని చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో పూడూరు తహసీల్దార్ కార్యాలయంలో కేవలం తహసీల్దార్, ఆర్ఐ, కంప్యూటర్ ఆపరేటర్‌తోనే నెట్టు కొస్తున్నారు. పూర్తి స్థాయి అధికారులు లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు చెబుతున్నారు.

అధికారులు లేక అవస్థలు...

రెవెన్యూ సమస్యలను పరిష్కరించే సరైన సిబ్బంది లేకపోవడంతో ప్రతీరోజు మండల కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనుల కోసం వచ్చేవారు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తాత ముత్తాతల నుంచి సంక్రమించిన భూముల విషయంలో గతంలో రెవెన్యూ అధికారుల తప్పిదాలతో నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. వాటిని సరి చేయించుకోవాలంటే ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకుంటే రిజెక్టు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే పూర్తి స్థాయి అధికారులు లేరని దాటవేస్తున్నారు.

పెరిగిన పని భారం



కార్యాలయంలో పూర్తి స్థాయి అధికారులు, సిబ్బందిలేక పని ఒత్తిడి పెరిగిన మాట వాస్తవం. సిబ్బంది కొరతతో ఇక్కడ ఎదుర్కొంటున్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పూర్తి సమయం రిజిస్ట్రేషన్లు చేయడానికే సరిపోతుంది. ఉన్న ముగ్గురిలో సెలవుపై వెళ్తే ఆరోజు మరింత పని భారం పెరుగుతుంది. ఆయా పనుల కోసం కార్యాలయానికి వచ్చేవారికి న్యాయం చేయలేకపోతున్నాం. కీలకమైన డీటీ, ఆర్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమిస్తే పనులు సజావుగా సాగుతాయి.

– భరత్‌గౌడ్, తహసీల్దార్, పూడూరు

అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతోనే..

బీజేపీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ నందు



రాంపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నందు

బంట్వారం: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని బీజేపీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ వడ్ల నందు పేర్కొన్నారు. గురువారం కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్‌లో ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ మెజార్టీ స్థానాలు గెలుచుకుంటుందన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం బలగమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, మాజీ ఎంపీటీసీ బందెయ్య, నాయకులు జగన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజు, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రైతు భరోసా హర్షణీయం

యాలాల: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రైతు భరోసా నిధులు మంజూరు చేయడంతో పీఆర్‌టీయూ యాలాల మండల అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై గతంలో తమ సంఘం తరఫున స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందించినట్లు ఆయన గుర్తు చేశారు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక సాయం అందడం లేదని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ విషయంలో పీఎం కిసాన్ నిబంధనలు కాకుండా భూములు కలిగిన రైతులకు కూడా రైతు భరోసా వర్తింపజేయడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర సర్కారు ఇచ్చిన మాట ప్రకారం నిబద్ధతతో ఉద్యోగులకు ఈ పథకం వర్తింపజేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామ శివారులోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీలో పని చేస్తున్న రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని డిప్యూటీ లేబర్ కమిషనర్ సునీల్ కుమార్ సాహుతో వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ..రైల్వే కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలు రూ.2లక్షల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. అదేవిధంగా కార్మికులకు సంబంధించి బూట్లు, బట్టలు, హెల్మెట్‌తో పాటు దసరా కానుక రూ.2 వేలు నేటికి మంజూరు చేయలేని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో స్పందించిన లేబర్ కమిషనర్ సీసీఐ యాజమాన్యాన్ని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీసీఐ ప్రతినిధి పాల్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి శరణప్ప, నాయకులు ఎల్లప్ప, దస్తప్ప, శ్రీను, అనంత్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దౌల్తాబాద్: పెద్ద చెరువుకట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతభిషేకం, కల్యాణం నిర్వహించారు. రాత్రి పల్లకీసేవ, తొట్లసేవతో పాటు రథోత్సవం నిర్వహించారు. ఉత్సవానికి చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయ బృందం

తాండూరు రూరల్: విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించొచ్చని పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సునీత పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో ఆంగ్లభాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఇంగ్లిష్ నేర్చుకోవడం సులువేనని కష్టమేమీ కాదన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆంగ్ల భాషలో పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఆంగ్ల ఉపాధ్యాయులు ద్యావరి నరేందర్‌రెడ్డి, శిరీషాదేవి, అప్పల నాయుడులకు శాలువ కప్పి పూలమాల వేసి సన్మానించారు. ఆంగ్ల భాషపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, సంధ్యారాణి, శంకర్, రామలింగేశ్వర్‌రావు, నజీర్ అహ్మద్, అనురాధ, రాధ, రవికుమార్, యాదగిరి, మధుసూదన్, జయశ్రీ,అనిత, కవిత, ప్రతిభ, సవిత పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం



సరోజినీ నాయుడు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దుద్యాల్: హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. సరోజినీనాయుడు జయంతి సందర్భంగా ఆంగ్లభాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సరోజినీనాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లిష్‌పై పలు పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సిములు, పీఈటీ అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15న సెలవు ప్రకటించాలి

తహసీల్దార్‌ను కోరిన గిరిజన ఉపాధ్యాయులు



పెద్దేముల్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజన ఉపాధ్యాయులు

తాండూరు రూరల్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేనావత్ రవికుమార్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం పెద్దేముల్ తహసీల్దార్ వెంకట్‌ప్రసాద్‌కు గిరిజన ఉపాధ్యాయులతో కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సేవాలాల్ జయంతిని తండాల్లో గిరిజనులు పండుగలా జరుపుకుంటారన్నారు. ఆ రోజు సెలవు ప్రకటించకపోతే ఉద్యోగులు, విద్యార్థులు జయంతిలో పాల్గొనేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదేవిధంగా సేవాలాల్ జయంతిని జరుపుకునేందుకు ప్రభుత్వం రూ.15 కోట్లు నిధులు విడుదల చేయాలన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో పెద్దేముల్ శాఖ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మహిళా కార్యదర్శి బుజ్జమ్మ, మండల ఉపాధ్యక్షుడు గోవింద్ నాయక్, సవిత తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులు బదిలీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. కోటబాసుపల్లి పంచాయతీ కార్యదర్శి లాలప్పను పెద్దేముల్ మండలకేంద్రానికి, సంకిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి శిరీషను చిట్టిఘనాపూర్‌కు, చిట్టిఘనాపూర్ కార్యదర్శి నవనీతను గోనూర్ గ్రామానికి, గోనూర్ పంచాయతీ కార్యదర్శి రషీద్‌ను రిజర్వుడ్‌లో ఉంచారు. అకస్మాత్తుగా వారిని బదిలీ చేయడంతో గురువారం వికారాబాద్ కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులను కలిసి ఆవేదన వ్యక్తం చేశా రు. ఈ సందర్భంగా స్పందించిన ఉన్నతాధికారులు సాధారణ బదిలీలో భాగమేనని సమాధానమిచ్చా రు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు లాలప్పను రాజకీయంగానే బదిలీ చేసిన ట్లు తెలుస్తోంది. అదేవిధంగా చెంగోల్ పంచాయతీ కా ర్యదర్శిని బదిలీ చేయాలని ఆ గ్రామానికి చెందిన యువనేత ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నా రని తెలిసింది.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు చెప్పాలి



రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: పోలింగ్ కేంద్రాలు, ఓటరులిస్టులో ఏదైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం సూచనల ప్రకారం గురువారం కుల్కచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటరులిస్టు, పోలింగ్ కేంద్రాలను నోటీసుబోర్డులపై ఆయా గ్రామాల జీపీ బోర్డులపై ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ అభ్యున్నతికి ప్రాధాన్యం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



కుల్కచర్ల మార్కెట్ యార్డులో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: రైతాంగ అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఉపాధిహామీ నిధులు రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో కుల్కచర్ల మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సబ్బండ వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం నిర్విరామంగా కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు రాంచంద్రయ్య, భరత్‌కుమార్ రెడ్డి, రాంచందర్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ నాయకులు అంజిలయ్య, మహేశ్, పెంటమీది వెంకటయ్య, జోగు వెంకటయ్య, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

చౌరస్తా విస్తరణకు శ్రీకారం



విస్తరణ పనులు నిర్వహిస్తున్న సిబ్బంది



అంబేద్కర్ చౌరస్తా మాస్టర్ ప్లాన్

కొడంగల్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా విస్తరణకు గురువారం శ్రీకారం చుట్టారు. హైదరాబాద్–బీజాపూర్, మహబూబ్‌నగర్–చించోలి జాతీయ రహదారులు కలిసే కొడంగల్ బస్టాండ్ ప్రధాన కూడలైన అంబేడ్కర్ చౌరస్తాను విస్తరించనున్నారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. సమీప భవిష్యత్‌లో కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తా కొత్త కళ సంతరించుకోనుంది. కొడంగల్ పట్టణ సుందరీకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు తదితర పనులకు రూ.337కోట్లు మంజూరు చేయడంతో స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడ)ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టనున్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

మండల విద్యాధికారి గోపాల్



దోమ: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్

పరిగి: పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని మహాత్మజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో గురువారం పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలు లేకుండా ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాలు తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ప్రణాళికబద్ధంగా పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నల్ టీం మెంబర్స్ కృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్, సీఆర్‌పీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై చర్యలు

దోమ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ వెంకట్ సూచించారు. గురువారం దోమ మండల పరిధిలోని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులను తెలుగు, ఆంగ్లం, గణితానికి సంబంధించిన పాఠాలను నేర్పించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ వర్క్ షీట్స్‌ను పరిశీలించి విద్యార్థులతో ఎప్పటికప్పుడు చదివించాలన్నారు. విద్యార్థులకు బోధనోపకరణాలను ఉపయోగించి పాఠాలు బోధించాలన్నారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించకుండా మెరుగైన విద్య అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత



అనంతగిరి: మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

దౌల్తాబాద్: దౌల్తాబాద్ గ్రామానికి చెందిన మహేశ్ ఆరు నెలల నుంచి బ్రెయిన్‌లో కణితి సమస్యతో అనారోగ్యం పాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఆపరేషన్ చేయించుకునేందుకు డబ్బులు లేకపోవడంతో ఇంటి దగ్గరే ఉంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్నేహితులు గురువారం గ్రామానికి చెందిన గ్రూపులో షేర్ చేశారు. దీనికి స్పందించిన గ్రామస్తులు, యువకులు తదితరులు ఫోన్‌పే ద్వారా తోచిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే మాటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కోట్లహన్మంతు రూ.11వేలు సాయం చేశాడు. ప్రతీనెల మందుల ఖర్చులను కూడా భరిస్తానని హామీ ఇచ్చారన్నారు. చేతికొచ్చిన కొడుకు అనార్యోగం పాలవడంతో బాధిత కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తనకొడుకు మెరుగైన వైద్యం చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని కొత్తగాడికి చెందిన అత్తిలి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు 2003–2004 పదోతరగతికి చెందిన బ్యాచ్ విద్యార్థులు మృతుని కుటుంబీకులకు రూ.60వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు వెంకటేశ్, లక్ష్మణ్, రాజు, సరోజ, భాగ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల పడిపూజ



దుద్యాల్: పడిపూజలో శివస్వాములు



బంట్వారం: బుగ్గరామలింగేశ్వర ఆలయంలో పడిపూజలో శివస్వాములు

దుద్యాల్: హస్నాబాద్ గ్రామంలో శివ స్వాములు పడిపూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బచ్చమొల్ల హన్మంతు ఇంట్లో గురువారం నిర్వహించిన పూజలో శివనామస్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, బిల్వష్టం, శివాష్టకం వంటి పూజలు నిర్వహించారు. శివ స్వాముల భజన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ పూజకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన దాదాపు 100 మంది శివ స్వాములు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని బుగ్గరామలింగేశ్వర ఆలయంలో మాజీ సర్పంచ్ లక్ష్మీవెంకటయ్య ఆధ్వర్యంలో శివస్వాములు మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మహేందర్ ఆయా గ్రామాల శివస్వాములు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రేషన్‌కార్డుల నమోదు

యాలాల: ప్రజా పాలనలో భాగంగా రేషన్‌కార్డు లబ్ధిదారుల వివరాల నమోదు ప్రక్రియ వేగంగా కొనసాగుతుంది. మీసేవ, సీఎస్‌సీ నిర్వాహకులతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది పాల్గొంటున్నారు. తహసీల్దార్ అంజయ్య ఆదేశాలతో గురువారం రాత్రి కూడా నమోదు ప్రక్రియను నిర్వహిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ రవి, సుజాత, నవనీత, శ్రీనివాస్, రికార్డు అసిస్టెంట్లు లావణ్య, వెంకటయ్య, నయీం, అనిత, కాశప్ప తదితరులు లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేషన్‌కార్డు లబ్ధిదారుల నమోదును నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ చరణ్ పాల్గొన్నారు.